
# .... గమ్యమెరుగని ప్రయాణం ....

రచన : శ్రీ చిల్లా సత్యనారాయణ రెడ్డి.



"ఏమే సుధా! బాగున్నావా?"—అన్న పిలుపుతో ఆశ్చర్యపడి వెనక్కి తిరిగి చూసింది సుధారాణి.

ఆలోచనలు అడ్డుపడి జ్ఞాపకశక్తి తడుముకుంది క్షణం సేపు.

"శాంతికదూ! అరె!! ఎంతలా మారిపోయింది. అయిదు సంవత్సరాలవుతుందేమో ఆమెను చూసి. ఎంత మార్పు?" అనుకుంది మనసులోనే.

"శాంతీ! ఎంతలా మారిపోయావే. పోల్చలేకపోయాను" అని పలకరించింది ఆదరంగా.

వాల్తేరునుండి బయలుదేరిన కలకత్తా మెయిలు తన విధి నిర్వహించాలన్నట్లు పారిపోతోంది లాకరు వదలి.

సుధారాణి వెనుక ప్రక్కనున్న సీట్లో కూర్చుంది శాంతి. ఒడిలో చిన్న పాపాయి ముద్దులు కురిపిస్తూ కేరింతాలు కొడుతోంది.

శాంతికెదురుగా ఖాళీ సీటుంటే వెళ్ళి కూర్చుంది సుధ.

"యిప్పుడేం చేస్తున్నావు? ఎక్కడుంటున్నావు?" అడిగింది శాంతి.

"మునుపు శాంతి మాట్లాడితే శృతిచేసిన వీణ మీటినట్లుండేది. కాని యిప్పుడు తెగిన తీగలు ముడివేసి మీటిన వీణలాగుంది. వివాహమయితే యింత మార్పు వస్తుందా స్త్రీలో"- యివీ సుధారాణి మనసులోని ఆలోచనలు.

"నా సంగతి తరవాతగాని, నువ్విప్పుడెక్కడికి వెల్తున్నావు? మీవారెక్కడున్నారు? నువ్వేమిటిలా అయిపోయావు?" అని ప్రశ్నించింది సుధారాణి.

తెచ్చిపెట్టుకున్న చిరునవ్వు నవ్వింది శాంతి.

"సుధా! జీవితంతో పోరాడాను" అంది బలహీనంగా.

"అయితే ఆ పోరాటంలో ఓటమి లభించిందంటావ్"

"ఊహు"

"అంత సులభంగా ఒప్పుకోవన్నమాట"

"అవును" అంది మునిపంట పెదవిని కొరుకుతూ.

"ఎలా ఒప్పుకుంటావులే? వివాహితయిన ప్రతి స్త్రీకి, కొన్ని ఆశయాలు, ఆదర్శాలుంటాయని, వాటి ఆచరణ మార్గంలో...సంకల్పబలం అనే స్థిరమయిన ఆయుధం ప్రయోగించి, ఎటువంటి ముళ్ళకంచె అయినా నరకవలసివస్తే-వెనకాడ కూడదనీ, కేవలం

తన యింటికోసమే తను అంకితమై పోకూడదని అవసరమైతే సంఘ సంక్షేమానికి మహిళాభ్యుదయానికి ఎంతైనా కృషి చేయాలని వారి వారి బాధ్యతల్ని విస్మరించకూడదని తీవ్రంగా లెక్చర్లిచ్చే దానివే? యిప్పుడెన్ని బాధ్యతల్ని నిర్వహించగలిగావు? ఎంత మాత్రం స్వేచ్ఛగా తిరగ్గలిగావు? చెప్పు'' అంది సుధారాణి మందహాసం చేస్తూ.

శాంతి ముఖంలో రంగులు మారాయి.

''ఏం? అవన్నీ యిపుడెవరైనా ఎందుకు చేయలేరనుకోవాలి?''

''చేయలేరని కాదోయ్ పెద్దమ్మా! ప్రతి మహిళ గృహిణిగా తన బాధ్యత నిర్వహించటానికే కొంత టైము, ఓపిక కావలసి వుంటుంది. అటువంటప్పుడు యితర కార్యక్రమాలకి కొన్ని అవరోధాలేర్పడతాయి.''

''ఏర్పడితే వాటిని తొలగించడానికి సర్వశక్తులా ప్రయత్నించాలి'' అంది కటువుగా.

''ప్రయత్నించి తీరాలని కాదు. ప్రతి గృహిణి మహిళాభ్యుదయానికీ, సంఘ సంక్షేమానికీ అంటూ వూరుమీదికి దండెత్తితే గృహ నిర్వహణలో వెలితి, వెలితిగానే వుండిపోతుంది. దాంపత్య జీవితంలో కలతలు, కల్లోలాలు రేగవచ్చు.'' అని సూటిగా ఆమె కళ్ళల్లోకి పరీక్షగా చూసింది సుధ.

శాంత బాధగా తన దృష్టి మరోవేపు త్రిప్పుకుంది.

వీళ్ళమాటలు అర్థం కాని పాపాయి తన ధోరణిలో తను ఆడుకుంటుంది.

''అయితే అలా అని బావిలోని కప్పలా ఓచోటుపడి వుండాలన్న మాట'' అంది శాంతి.

''మరీ అంతగా నిర్బంధించే దెవరు? ఏవో కొన్ని నియమాలకి కట్టుబడి వుండాలంటారంతే'' అంది కవ్వింపుగా.

''కట్టుబడి వుండకపోతే గాలికి తిరుగుతారా? మనసుల్ని అర్థం చేసుకు తిరగాలిగాని''

''ఓహో! అలాగా! ఎదటివారు మనకి అర్థమయ్యేలా ప్రవర్తించామా అని మనసులోనే ఓ నిర్ధారణ చేసుకోవాలి'' అని ఆగింది సుధ.

యీ మాటలతో యింతసేపు లోలోన అణగారిని దుఃఖమంతా పైకి పెల్లుబికినంత పనయింది శాంతికి. తన నెవరో ఎత్తిపొడుస్తున్నట్లు బాధపడుతోంది.

''ప్రవర్తించి ఏం లాభం? గుర్తించగలగ లేనప్పుడు'' అంది గాద్గదికంగా.

సుధారాణి మనసు వెన్నలా కరిగిపోయింది.

''గుర్తింపబడేంత మార్పు మనతో మనమే తీసుకు రావాలి శాంతీ'' అంది లాలనగా. అప్రయత్నంగా శాంతి కళ్ళనుండి రెండు బాష్ప బిందువులు టప్‌టప్‌న రాలి పడ్డాయి.

బండి విజయనగరంలో ఆగింది. సుధ శాంతిదగ్గర శలవు తీసుకుని, పాపాయికి ముద్దిచ్చి బండి దిగిపోయింది. కొంతసేపట్లో శాంతి బరువైన హృదయంలా బండి కూత కూసి భారంగా కదిలిపోయింది.